# 2. నేరస్థులు

“హై హై... చోచో... రోయ్ పక్కకి తొలగరో సుబ్బన్నో... ఎద్దు కొమ్ము యిసిరిద్ది... మాదర్సొద్దీ! అసలే బక్కోడివి! దాని కొమ్ము తగిలితే నుగ్గు నుగ్గవుతావు! నిన్ను ఏ ఆస్పత్రికో తీసకపోవాల్సి వచ్చిద్ది!” ఎద్దుల్ని పొలం తోలుకుపోతూ, పొలం దున్నే గొర్రుని భుజం మీద పెట్టుకుని, ఎద్దుల్ని అదిలిస్తూ, వాటికి అడ్డం వచ్చిన సుబ్బయ్యని కేకేసి చెప్పాడు కనకయ్య.

“ఎద్దుల మెడకి గంటలు కట్టుకోకూడదంటన్నా?” పక్కకి తప్పుకున్న సుబ్బయ్య అన్నాడు.

“గంటలకి వారు తెగిపోయిందిరా! అది కుట్టుకుని రమ్మనమని మాదిగోడు ఎంగడకి ఇచ్చా! ఇచ్చికూడా నెల రోజులు పైనే అవతంది! వాడు ఏ రోజు కారోజు రేపిస్తాను మాపిస్తాను అంటన్నాడు. పనుల రోజులాయె! వాడికి కూలికి పోవటంతోనే సరిపోతందట్టుగా ఉంది! నువ్వు కాస్త యెనకా ముందూ చూసుకుని నడువ్!”

ఇంకా పొద్దు పొడవలేదు.

చల్లటి గాలి కొడుతోంది.

ఎడతెరిపి లేకుండా వారం రోజులుగా కురిసిన వర్షం తెరిపి ఇచ్చి మూడు రోజులు అవుతోంది.

పొలం వెళ్ళే ఆ డొంక అంతా బురద బురదగా, రొచ్చు రొచ్చుగా, రోత రోతగా ఉంది.

ఆ బురదలోనే జనం నడుస్తోంటే సన్నటి కాలిబాట పడింది. ఆ బాటలోనే అడుగువెంట అడుగు వేసుకుంటూ జాగ్రత్తగా నడవాలి. అడుగు పక్కకి పడితే బురదలో కాలు పడటమే!

"ఏం పైరు ఎద పెడతన్నావన్నా?" కనకయ్యని అడిగాడు సుబ్బయ్య.

"మజ్జెన్నం నించీ మినుము ఎద పెట్టాలిరా! నిన్న మాయిటిపూట దుక్కిలో సత్తువ మందు చల్లాం. ఈ పూట ఒకసాలు గొర్రుతోలి మజ్జెన్నం నించీ రెండోసాలు మీద యిత్తులు ఎదపెడతాం!"

"అయితే పొలం ఆరిందంటున్నా ఎద పెట్టడానికి?"

"ఏం ఆరటంలే! అజ్జామజ్జాగా ఆరింది! తొందరపడి ఎద పెట్టుకోకపోతే కార్తిపోతండే! అదును తూలి ఎద పెట్టుకుంటే ఏం లాభం? నిరుడు ఇట్నే రెండు రోజులు యెనక చిక్కి యిత్తులు పడేసరికి రెండు బస్తాలు దిగుబడి తగ్గిపోయింది"

"నిరుడు ముందు యేసినోళ్ళకీ, యెనక చిక్కియేసినోళ్ళకీ చాలా తేడా వచ్చిందన్నా!"

"మరేందనుకున్నా? మన పెద్దోళ్ళు వూరకనే అన్నారా... పైరుకి ముదురూ పసురానికి లేతా అనీ... ముందు ముందే యెనక యెనకే.. ఎంత తొందరపడి పైరు ఎద పెట్టుకుంటే అంత మంచిది!"

"నిజమే అన్నా... అదునూ పదునూ పోయిన తరవాత రమ్మంటే వస్తయ్యా? రావు కదా! అందరికీ తొందరగా ఎద పెట్టుకుందామనే ఉంది. కానీ సత్తువలు... అయ్యి దొరికి చావకపోతండే! నువ్వెట్టా చేసా సత్తువలూ?"

"ఎందుకైనా మంచిదని నెల రోజుల నాడు పన్నెండు బస్తాలు కొనక్కొచ్చి ఇంట్లో పడేసుకున్నారా! అయ్యి ఆరు ఎకరాలకి వచ్చినయ్యి. ఇంకా చాలా బస్తాలు సత్తువలు కావాలి. ఎట్ట చెయ్యాలో, ఏం పాడో!"

"కొనబోతే కొరివీ అమ్మబోతే అడివీ అని మనకి పండిన పంటలకేమో ధరల్లేక పోతండే! సత్తువ మందులకేమో వాళ్ళ ఇష్టం వచ్చినట్లు ధరలు పెంచి కూర్చుంట్రీ మందుల కొట్టోళ్ళు! ఎదవది రెండొందలమ్మే డీఏపీ ఐదు వందలంటన్నారు! ఎట్ట చచ్చేటట్టా? సత్తువ పొలంలో యేసేటట్టా, మానుకునేటట్టా!"

"డీఏపీ, కాంప్లెక్స్ మందుల యవారం తీసెయ్! అవి ఇరవయ్యో,పాతికో ఎక్కువకి అమ్ముకుంటున్నారు. యూరియా – దానబ్బడాల... అది పొలానికి సత్తువ కూడా కాదు. అది బస్తా! మూడు వందలంటున్నారే... ఏం కొంటామూ, ఏం చేస్తాంరా ఎగసాయం మనం?"

"యూరియా గవరమెంటు రేటు నూట డెబ్బయ్ రూపాయలేనదంట కదన్నా! అది మూడు వందల చేసి బ్లాకులో అమ్ముతున్నారు. ఎంత మోసం! అదేమంటే మీరు ఇష్టమైతేనే కొనుక్కోండి, లేకపోతే లేదు అంటున్నారు. ఇదేందన్నా?"

"మన అక్కరని చూసి పెంచేశారు. సత్తవల ధరలు పెరిగేసరికి అందరూ కళ్ళు మూసుకుని యూరియానే పొలానికి చల్లతన్నారు. ఏదయితేనేం మందేగదా! ఇంతకంటే మనం చేసేదేం ఉంది?"

"యూరియాకి ఇయ్యేడంత కటకట నేను ఎప్పుడూ చూళ్ళేదన్నా!"

"వెనకటి రోజుల్లో మాదిరిగా నయ్యిమట్టీ, గొర్రె పెంటా, పందిపెంటా పొలాలకు తోలుకునే వాళ్ళే కరవైపోతిరి! అందరూ రసాయనాల మందుల కోసం ఎగబడతన్నారు. ఇంక యేపారస్తులు వాళ్ళ ఇష్ట మొచ్చినట్టు సత్తవలకి ధరలు పెంచక ఏం చేస్తారు? చివరకి ఆ మందులు వెయ్యలేకా, చౌక అనీ, ఏదో ఒకటనీ యూరియా కోసం అర్రులు చాస్తంటే దీనికి కూడా మరీ అడ్డగోలుగా బ్లాకున వాళ్ళిష్టమొచ్చిన ధరకి అమ్ముతున్నారు!"

"మా మొక్కజొన్న చేను బాగా కండె వచ్చి ఉందన్నా! ఈ వానకి యూరియా వేస్తే కండె పూరి, గింజ గట్టిపడిద్దని యూరియా కోసం మొన్న ఇంకొల్లుపోతే, బస్తాకి మూడొందలు కాజేసి అయిదు బస్తాలు ఇచ్చేడు ఆ మందుల కొట్టోడు! అవసరం మనదాయె! గవరమెంటోడేమో ఏ రోజు కారోజు యూరియా నిల్వలు బాగున్నయ్, యూరియా మస్తుగా దొరకుతోంది, నూట డెబ్బయ్ రూపాయలకే కొనుక్కోండి అని పేపర్లలో రాస్తండే!"

"అదును వచ్చి కూర్చుంది. ఇంక నాల్రోజుల్లో పైర్లు ఎద పెట్టుకోకపోతే, ఇంక ఇయ్యేటికి తినేదేం ఉండదు! మనం కాంప్లెక్సలు కొని పొలానికి వేసు కోకపోయినా, కనీసం ఎకరానికి రెండు బస్తాలు యూరియా అయినా వేస్తే పండిన కాడికి పండిద్ది"

"మరి అది మూడు వందలంటున్నారు కదన్నా?"

"నూట డెబ్బయ్‌కి అమ్మాల్సిన బస్తా మూడు వందలంటే ఇంక రైతులు ఉంటానికేనంట్రా? ఇంత నిలువుదోపిడా? ఇంత అడ్డగోలుగా అమ్ముతుంటే రైతులు ఉంటారా, ఊడ్చుకుని పోతారా? నా మట్టసానికి నాకు పత్తికి గానీ, మొక్కజొన్నకి గానీ, మిరపకిగానీ, దుక్కిలో వేసుకోవటానికి కానీ 30 కట్టలు యూరియా కావాల! 30 కట్టలకి నాలుగైదు వేల రూపాయలు వాడికి మాదానంగా ఇయ్యాలి! పంటలు సరిగా పండకా, పండిన పంటలకి ధరల్లేకా

మనం అల్లాడిపోతంటే ఈ మందుల కొట్టోళ్ళ పీడ ఏం దంట?" కోపంగా అన్నాడు కనకయ్య.

"దొంగెదవలు... బ్లాకున బస్తాకి 130 రూపాయిల ఆదాయం తీసుకుంటున్నారంటే ఎంత ఆదాయమన్నా? ఈ లెక్కన 100 బస్తాలకి ఎంత ఆదాయం... మరి వెయ్యి బస్తాలకీ... అమ్మో" అని ఆశ్చర్యపోయాడు సుబ్బయ్య.

"మరి మందుల కొట్టోళ్ళు మూడో నాటికే మేడమీద మేడ కడతన్నారంటే ఎంత ఆదాయం లేకపోతేరా?"

"మనం ఎవురిమీ అసలు యూరియా కొనకపోతే అన్నా."

"మంచోడివేరా! పైరు యేసుకోకుండా పొలాన్ని ఊరక అట్టిపెట్టుకుందామా! అసలు వాటిని బ్లాకున అమ్మకుండా చేయాల కానీ..."

"మరి ఎట్ట చేద్దామన్నా?"

"ఈ యవారం ఏందో తేల్చిపారేద్దాంరా! ఊరుకుంటే లాభం లేదు! అదునులో పైరు ఎదపెట్టుకోకుండా, అదును పోయిన తరువాత అగోరిస్తే ఏం లాభం? తాడో పేడో తేలుద్దాం!" అన్నాడు కనకయ్య.

అదును దాటిపోతున్నదని రైతులు ఆందోళనతో ఉన్నారు. తొందరగా పైర్లు ఎద పెట్టుకోవాలనే ఆతృతతో ఉన్నారు.

ఆ రోజు సందకాడ అన్నాలు తిని, రైతులు చాలామంది రామాలయం దగ్గర కూడారు.

ఏం చేద్దామంటే ఏం చేద్దామనుకున్నారు.

"రేపొద్దున్నే అందరం బండ్లు కట్టుకుని పోదాంరా! గోడవున్ల మీదకు పోయి పడదాం! మామూలు ధరకి ఇచ్చారా సరేసరి! మామూలు ధరకి ఇయ్యకపోయారో దౌర్జన్యంగానే బండ్లమీద బస్తాలు వేసుకుని వద్దాం. వాళ్ళకి ఇవ్వాల్సిన దబ్బు మాత్రం ఇద్దాం! ఎవరేం చేస్తారో తరువాత తేల్చుకుందాం!" అన్నాడు కనకయ్య.

"అసలు గోడవున్లలో సరుకు ఉందో లేదో మనకెట్టా తెలిసిద్ది?" ఒక రైతు సందేహం వెలిబుచ్చాడు.

"ఇద్దరి ముగ్గురి గోడవున్ల నిండా దిట్టంగా ఉంది యూరియా స్టాకు! నేను ఇయ్యాలే నాలుగు బస్తాలు బ్లాకున కొనుక్కొచ్చా మూడు వందలుచేసి! నేను బోయిన షాపు గోడవున్ నిండా ఏ ఇరవై లారీల సరుకువుందో!" అన్నాడు మరో రైతు.

మరుసటి రోజు వేకువనే చద్ది అన్నాలు తిని ఒక ఊరేగింపు మాదిరిగా బండ్లు కట్టుకుని ఇంకొల్లు బయలుదేరారు.

ఇంకొల్లు ఆ వూరికి నాలుగు మైళ్ళ దూరంలో ఉంది.

వీళ్ళు 8 గంటలకి ఇంకొల్లు చేరుకున్నారు.

బండ్లు వూరికి వెలుపల దూరంగా ఉండగానే ఒక కుర్రాడు డబ్బు బాగా కనపడేలా జేబులో పెట్టుకుని 'కర్షక్ ఆగ్రో సెంటర్' అనే ఎరువుల షాపులోనికి వెళ్ళాడు.

ఆ షాపు బోర్డుమీద ఒక రైతు భుజాన నాగలిపెట్టి చొక్కా లేకుండా ఉన్నాడు.

షాపులో గుమస్తా, ముఠా కూలీలు ఇద్దరు కూర్చుని ఉన్నారు.

"యూరియా కావాలండీ" వెళ్ళిన కుర్రవాడు అడిగాడు.

"ఏ ఊరు మీది?"

ఏ ఊరో చెప్పాడు ఇతను.

"ఎన్ని బస్తాలు కావాలి?"

"పది బస్తాలు"

"రేటు తెలుసుగా! బస్తా 3 వందల లెక్కన అమ్ముతున్నాం. నీకు బిల్లు మాత్రం 170 రూపాయిలకి రాసిస్తాం. మా దగ్గర ఎక్కువ బస్తాలు కూడా లేవు"

"సరే కానివ్వండి. తొందరగా ఇవ్వండి. ఇంటికి పోయిన తరువాత చేలోకి పోయి యిత్తులు ఎదపెట్టుకోవాల్సిన పని ఉంది" అన్నాడు అతను.

గుమస్తా అతని దగ్గర డబ్బు తీసుకుని బిల్లు రాశాడు.

"గోడవున్లో ఉన్నయ్యి బస్తాలు. బండి అక్కడికి తోలుకుని పా! అటునించి అటే మీ ఊరు పోవచ్చు" అన్నాడు గుమస్తా.

అంతలోనే షాపు యజమాని వచ్చాడు.

పారుగూరి రైతులు యూరియా కోసం బండ్లు కట్టుకుని చాలామంది వస్తున్నారని ఆ యజమానికి తెలిసింది. వాళ్ళు చాలామంది ఉన్నారనీ, గొడవ చేసే అవకాశం ఉందనీ ఆయన భావించాడు. అందుకే తొందరగా బయల్దేరి షాపుకి వచ్చాడు.

"యూరియా లేదబ్బాయి. రాత్రే అయిపోయింది సరుకు. మా గుమాస్తాకి తెలియక నీ దగ్గర డబ్బు తీసుకున్నాడు" అని ఆ కుర్రవాడికి చెప్పి, గుమస్తాతో డబ్బు అతనికి తిరిగి ఇప్పించాడు.

"కావాలి గదండీ!" అన్నాడు ఆ కుర్రవాడు.

"లేదు. ఏం చేద్దాం!" అన్నాడు షాపు యజమాని పాపం ఒకింత బాధగా.

ఆ కుర్రవాడు వెళ్ళి జరిగిన విషయం తోటి రైతులకి చెప్పాడు.

రైతులు తర్జనభర్జనలు పడ్డారు. చర్చించుకున్నారు.

చివరకు అందరూ గోడవున్ దగ్గరికి చేరుకున్నారు.

అలాంటి ప్రమాదం జరిగే అవకాశం ఉందని భావించిన ఆ షాపు యజమాని అక్కడే సిద్ధంగా కూర్చుని ఉన్నాడు.

రైతులకీ, అతనికీ మధ్య వాదన జరిగింది. ఘర్షణ పడ్డారు.

చివరికి రైతులు దౌర్జన్యంగానే గోడవున్ తాళాలు పగులగొట్టే కార్యక్రమానికి ఉపక్రమించారు.

దిక్కుతోచని ఆ యజమాని వెళ్ళి పోలీసుల్ని కలిశాడు.

రైతులు దొమ్మీకి వచ్చారనీ, దౌర్జన్యానికి పాల్పడ్డారనీ 12 మంది రైతులు మీద కేసు పెట్టాడు.

బ్లాకులో యూరియా అమ్మిన సొమ్ములో కొంత భాగం పోలీసులకి మామూలు రూపంలో అప్పటికప్పుడే అందింది.

డబ్బు పుచ్చుకున్న పోలీసులు ఉత్సాహంతో రంగంలోనికి దూకారు.

కనకయ్య, సుబ్బయ్యతోపాటు మరో పదిమంది రైతుల్ని అరెస్టు చేసి, వాళ్ళమీద దొమ్మీ కేసు పెట్టారు.

అరెస్టుచేసిన రైతుల్ని తీసుకుపోయి పోలీసులు కోర్టులో హాజరు పరిచారు.

ఎద్దూ గేదే, కాడీమేడీ, కలుపూకష్టం, పాడీపంటా, చెమటా చాకిరీ తప్ప మరో ధ్యాస పట్టని, మరో విషయం ఏమీ తెలియని ఆ రైతులకి వారం రోజులపాటు రిమాండు విధిస్తూ న్యాయమూర్తి తాత్కాలిక ఆదేశాలు జారీ చేశాడు.

ఆదివారం ఆంధ్రజ్యోతి – ౧౨ మే, 1996